క్లుప్తంగా

కోటిలింగాల క్షేత్రంలో దీపోత్సవానికి ఏర్పాట్లు

ఫిరంగిపురం: మండలంలోని వేమవరం గ్రామంలోని అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోటిలింగాల క్షేత్రంలో కార్తిక సోమవారం దీపోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకుడు లక్ష్మీనారాయణ ఆదివారం తెలిపారు. మహాకాళేశ్వరుడికి తెల్లవారు జామునే మహారుద్రాభిషేకం నిర్వహించి విశేష పూజలు నిర్వహిస్తారన్నారు. భక్తులు కార్తిక దీపాలు పెట్టేందుకు వీలుగా ధ్వజ స్తంభం తదితర ప్రదేశాల వద్ద ఏర్పాట్లు చేసామని చెప్పారు. మరకత లింగానికి భక్తులు స్వహస్తాలతో అభిషేకాలు చేసుకునేలా శుద్ధ జలం ఉంచుతున్నట్లు తెలిపారు. భక్తులు తాము తెచ్చుకున్న ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించుకోవచ్చని చెప్పారు. సాయంత్రం యాగశాల వద్ద మహామృత్యుంజయ హోమం నిర్వహిస్తారని దానిలో భక్తులు ఎటువంటి రుసుం లేకుండా పాల్గొనవచ్చని తెలిపారు.

ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి



మంగళగిరి: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకుని ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని కేఎల్‌యూ కంప్యూటర్ సైన్స్ ప్రిన్సిపల్ డాక్టర్ సుబ్రమణ్యం తెలిపారు. మండలంలోని ఆత్మకూరులో కేఎల్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రత్యేక క్యాంపులను వినియోగించుకుని ఓటు నమోదు, మార్పులు చేర్పులు చేకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ పి.శ్రీకాంత్‌రెడ్డి, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ పి.ఉషారాణి, కో ఆర్డినేటర్ పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మేంద్రస్వామి బ్రహ్మోత్సవాలు



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉదయాన్నే స్వామివార్లకు అర్చకులు వెంకటాచార్యులు అభిషేకాలు నిర్వహించి అష్టోత్తర, సహస్ర నామ పూజలు చేశారు. అనంతరం యాగశాలలో హోమం, పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామి వారి ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ మేనేజింగ్ ట్రస్ట్ చైర్మన్ ఎస్‌వీఎస్ కుమార్‌దేవ్ పర్యవేక్షించారు.

ముగిసిన ఉచిత వైద్య శిబిరం



తాడేపల్లిరూరల్ : మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని దుగ్గిరాల గ్రామం కంభంపాటి నారాయణ జూనియర్ కళాశాలలో ఆదివారం వెరికోస్ వెయిన్స్ రోగులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కేఆర్ఆర్ఎం డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి రాంబాబు మాట్లాడుతూ ఏషియన్ వాస్క్యులర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించామని, వెరికోస్ వెయిన్స్ వ్యాధిగ్రస్తులు సుమారు 70 మందికి పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు అందజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వంశిక, డాక్టర్ అనీల్, నవీన్, లోకేష్ తదితరులు తమ వైద్య సేవలు అందించారని, అవసరమైన వారికి బుధవారం హైదరాబాద్‌లో ఉచితంగా సర్జరీలు నిర్వహిస్తామని వైద్యులు తెలియజేశారని అన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసరాలు, దుప్పట్లు పంపిణీ



తాడికొండ: సెయింట్ పాల్స్ సొసైటీ ఆధ్వర్యంలో పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు, పేదలకు ఆదివారం దుప్పట్లు, నిత్యావసరాలను పంపిణీ చేశారు. సొసైటీ అధ్యక్షుడు బెజ్జం సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో బడేపురం గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 70 మందికి నిత్యావసర సరుకులతో పాటు బెడ్ షీట్‌లను అందజేశారు. గ్రామస్తులు, సొసైటీ సభ్యులు బెజ్జం రాజేష్, బోరుగడ్డ ఏలియా, పాలడుగు మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

రెండు సంవత్సరాల్లో అందుబాటులోకి క్రికెట్ స్టేడియం

- అంతర్జాతీయ మ్యాచ్‌ల నిర్వహణకు సన్నాహాలు
- విశాఖ కంటే పెద్ద స్టేడియంగా మంగళగిరి స్టేడియం
- 60 శాతం పనులు పూర్తి, త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు
- మరో ఏడాదిన్నరలో పూర్తి చేస్తామన్న ఏసీపీ అధ్యక్షుడు
- పార్కింగ్, స్పోర్ట్స్ సెంటర్‌లకు 35 ఎకరాలు కేటాయించాలని సీఆర్‌డీఏకు ప్రతిపాదనలు
- రోడ్ల అనుసంధానమే ప్రధానం

క్రీడా ప్రేమికుల కల నెరవేరుతున్న వేళ..!



అమరావతి టౌన్‌షిప్‌లో ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం





పూర్తయిన పరిపాలన భవనం, ఇండోర్ స్టేడియం

మంగళగిరి: రాజధానిలో ప్రధాన నగరంగా ఉన్న మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నవులూరు అమరావతి టౌన్ షిప్‌లో ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మాణం మరో రెండు సంవత్సరాల్లో పూర్తి చేసేలా సన్నాహాలు చేస్తున్నారు. మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్‌కు మణిహారం లాంటి ఏసీఏ అంతర్జాతీయ స్టేడియంలో రెండు సంవత్సరాలలో అంతర్జాతీయ మ్యాచ్ నిర్వహించేలా చర్యలు తీసుకుంటుండడంతో క్రికెట్ ప్రేమికుల కల నెరవేరనుంది.

✦ 2008లో దివంగత మహానేత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మంగళగిరి పట్టణాన్ని ఆనుకుని నవులూరు, నిడమర్రు, బేతపూడి గ్రామాల మధ్య అమరావతి ఉడా టౌన్ షిప్ ఏర్పాటు చేశారు.

✦ టౌన్‌షిప్‌లో 23 ఎకరాల భూమిని ఆంధ్రా క్రికెట్ అసోషియేషన్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కొనుగోలు చేసింది. ఏసీఏ ఆధ్వర్యంలో 2014లో క్రికెట్ స్టేడియం నిర్మాణం ప్రారంభించి పరిపాలనా భవనం, ఇండోర్ స్టేడియం పూర్తి చేసుకుని క్రికెట్ క్రీడాకారులకు శిక్షణ ప్రారంభించారు.

✦ రూ.120 కోట్ల అంచనాతో ప్రారంభమయిన క్రికెట్ స్టేడియంలో గ్యాలరీల నిర్మాణం, పిచ్ ఏర్పాటు సైతం పూర్తి కావచ్చింది. రూ.70 కోట్ల నిధులను ఖర్చు చేసిన ఏసీఏ 60 శాతానికి పైగా పనులు పూర్తి చేసింది. మరో రూ.50 కోట్ల నిధులు రావాల్సి ఉందని నిర్వాహకులు తెలిపారు. బీసీసీఐలో వివాదాలు లోథా కమిటీ కారణంగా నిధుల విడుదల నిలిచిపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. వాస్తవానికి నిధులు విడుదల అయి ఉంటే 2019 నాటికే స్టేడియం పనులు పూర్తి కావాల్సి ఉంది.

✦ నిధులు విడుదలలో జాప్యం, ఏసీఏ పట్టించుకోకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ఎట్టకేలకు ఏసీఏ నూతన అసోషియేషన్ ఏర్పాటు చేయడంతో మరలా స్టేడియం పనులపై దృష్టి సారించింది.

✦ ప్రధానంగా మ్యాచ్‌ల నిర్వహణకు స్టేడియంకు వచ్చే రోడ్లు పూర్తి చేయడం అనుసంధానం చేయడంతో పాటు వాహనాల పార్కింగ్‌తో పాటు స్పోర్ట్స్ సెంటర్ కొరకు మరో 35 ఎకరాల భూమి అవసరం కాగా ఇటీవల నూతనంగా ఏర్పాటైన ఏసీఏ అసోషియేషన్ 35 ఎకరాలు కేటాయించాలని సీఆర్‌డీఏను కోరింది.

✦ రాష్ట్రంలో ఇప్పటికే విశాఖపట్నంలోని మైదానంలో 28 వేల మంది ప్రేక్షకులు మాత్రమే పట్టే అవకాశం ఉండగా మంగళగిరి స్టేడియంలో 36 వేల మంది ప్రేక్షకులకు అవకాశం ఉంది.

✦ స్టేడియంకు మంగళగిరి నుంచి వెళ్లేందుకు రవాణామార్గం నిడమర్రు రైల్వే గేటు అడ్డుగా ఉండగా వంతెన నిర్మించాలని ప్రభుత్వం ప్రతిపాదనలను రైల్వే బోర్డుకు పంపగా వంతెన నిర్మాణానికి బోర్డు అంగీకారం తెలిపింది.

✦ కాజ నుంచి కృష్ణా జిల్లాకు నిర్మించనున్న ఇన్నర్ రింగ్ రోడ్డు పనులు పూర్తి కానుండగా మరో రోడ్డు రాజధాని సీడ్‌యాక్సెస్ రోడ్డుని స్టేడియంకు అనుసంధానం చేయనున్నారు.

✦ మహిళలు, పురుషుల అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు జరుగుతున్నా పూర్తి స్థాయిలో అంతర్జాతీయ మ్యాచ్ జరిగితేనే స్టేడియంకు గుర్తింపు వస్తుందని క్రీడాభిమానులు ఆశిస్తున్నారు.

✦ ఏసీఏ అధ్యక్షుడు ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ స్టేడియంకు వచ్చే రోడ్లను అనుసంధానం చేసేందుకు త్వరితగతిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పార్కింగ్ సౌకర్యంతో పాటు స్పోర్ట్స్ సెంటర్ నిర్మాణాలకు 35 ఎకరాలు అవసరం కాగా కేటాయించాలని సీఆర్‌డీఏను కోరడం జరిగిందన్నారు. అన్ని పనులు పూర్తి చేసి రెండు సంవత్సరాలలోపు అంతర్జాతీయ మ్యాచ్ నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



స్టేడియం ప్రధాన రహదారి పై ఓవర్ నిర్మాణం కానున్న నిడమర్రు రైల్వే గేటు

కార్యకర్తలకు అండగా ఉంటాం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డీవీఆర్

మంగళగిరి: ఏ ఒక్క కార్యకర్తకు సమస్య వచ్చినా అందరం ఏకమై అండగా ఉంటామని, ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) భరోసానిచ్చారు. ఆదివారం మండలంలోని ఆత్మకూరు జాతీయరహదారి వెంట గల వైఎస్సార్ సీపీ కార్యాలయంలో తాడేపల్లి మండల పార్టీ అధ్యక్షుడు అమరా నాగయ్య అధ్యక్షతన నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వేమారెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు అన్ని వర్గాలను మోసం చేశాడని, ప్రజలకు ఏమి చేశారో సమాధానం చెప్పలేక ప్రశ్నిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. అక్రమ కేసులకు ఎవరూ భయపడాల్సిన పని లేదని ప్రతి కార్యకర్తకు తనతో పాటు పార్టీ అండగా ఉంటుందన్నారు. ఇలాంటి దుర్మార్గపు పాలన గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. సోషల్ మీడియాలో పెట్టే పోస్టులు రాజకీయపరంగా ఉండాలని అసభ్యకరంగా ఉండకూడదన్నారు. రానున్న ఎన్నికలలో వైఎస్సార్ సీపీని గెలిపించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కుంటున్నారన్నారు. ఎన్నికలలో ఇచ్చిన ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. గత ప్రభుత్వ పాలనలో జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలతో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి పేదవాడి అభివృద్ధికి కృషి చేశారన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలలో వ్యతిరేకత నెలకొందన్నారు. మంగళగిరిలో మరోసారి వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయడం ఖాయమని స్పష్టం చేశారు. మాజీ ఆప్కో చైర్మన్ చిల్లపల్లి మోహనరావు మాట్లాడుతూ సనాతన ధర్మం అంటే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు అర్థం తెలుసా అని ప్రశ్నించారు. సనాతన ధర్మం, సోషల్ మీడియా పేరుతో ప్రజలను పక్కదారి పట్టిస్తూ కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. ఈ రోజు వరకు ఒక్క పథకం అమలు చేయని కూటమి ప్రభుత్వంపై రాజకీయ పోరాటం చేయాలని, వ్యక్తిగతంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టవద్దని రాజకీయంగా ఎదుర్కుందామన్నారు. ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని మంగళగిరిలో పార్టీకి పూర్వవైభవం తీసుకువచ్చి విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పాటిబండ్ల కృష్ణమూర్తి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

ప్రహరీ నిర్మించరూ...

ఫిరంగిపురం: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న గత ప్రభుత్వ లక్ష్యం పూర్తిగా దెబ్బతింటోంది. మండల కేంద్రంలోని సచివాలయం-3 పరిధిలో కోనేరు సమీపంలో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌కు ప్రహరీ లేక ఆరోగ్య సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. హెల్త్ క్లినిక్ ఇళ్లకు దూరంగా ఉండటంతో కొందరు మందుబాబులు సాయంత్రం అక్కడకు చేరి మందు తాగి బాటిళ్లను అక్కడనే పడేసి వెళుతున్నారు. దీంతో ప్రతి రోజు సిబ్బంది వచ్చి వాటిని శుభ్రం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక్కడకు ప్రతి రోజు వైద్యం కోసం 40 మంది వరకు రోగులు వస్తుంటారు. హెల్త్ క్లినిక్‌కు ప్రహరీ లేకపోవడంతో సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. సంబంధిత శాఖాధికారులు స్పందించి హెల్త్ క్లినిక్‌కు ప్రహరీ నిర్మించేలా చూసి మందుబాబులను కట్టడి చేసేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



హెల్త్ క్లినిక్ వద్ద పడి ఉన్న మందు సీసాలు

అధిక ధరలను నియంత్రించండి

సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు



ప్రజాపోరు ప్రచార కార్యక్రమంలో ప్రసంగిస్తున్న పాశం రామారావు

తాడేపల్లిరూరల్ : రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు ప్రజలకు భారంగా మారాయని, అధిక ధరలను వెంటనే ప్రభుత్వం నియంత్రించాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లిలో నిర్వహిస్తున్న ప్రజాపోరు ప్రచార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగిస్తూ నవంబర్ 14న తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిర్వహించనున్న ధర్నాలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినా దేశంలో మాత్రం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచుకుంటూ పోతున్నారని విమర్శించారు. రాష్ట్రాల హక్కులు కాలరాసేందుకు, రాజ్యాంగానికి తూట్లు పొడిచేందుకు కేంద్రంలోని బీజేపీ తీసుకువస్తున్న జమిలి ఎన్నికలను ప్రజలందరూ వ్యతిరేకించాలని అన్నారు. సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి మాట్లాడుతూ రాజధానిలో ప్రారంభించబోయే అభివృద్ధి పనుల్లో స్థానికులకే ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నామన్నారు. రాజధానిలో నెలకొల్పిన విట్, ఎస్ఆర్ఎం, అమృత మయ యూనివర్సిటీల్లో రాజధాని పిల్లలకు ఉచిత విద్యను అందించాలని, టిడ్కో గృహాల లబ్ధిదారులకు ఉపాధి లేనందున బ్యాంకు రుణాలను రద్దు చేయాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.భాస్కరయ్య, ఓం శాంతి, ఓలేటి శ్రీనివాస్ కుమార్, రమేష్, సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు వల్లభాపురం వెంకటేశ్వరరావు, ఎం.భాగ్యరాజు, సీపీఎం రెండవ శాఖ కార్యదర్శి టి.బక్కిరెడ్డి, మూడవ శాఖ కార్యదర్శి సంకురు ఇమ్మానుయేల్ రాజు, రాజధాని నాయకులు కె.జగదీశ్వర్ రెడ్డి, వి.పార్ధ సారథి, ఆర్.వి.రాఘవయ్య, టి.శివయ్య, కంచర్ల శేషయ్య, చెంచయ్య, మస్తాన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చొక్కా ఆశీర్వాదం వర్ధంతి

తాడేపల్లిరూరల్ : ఎంటీఎంసీ పరిధిలోని ప్రాతూరు గ్రామంలో సీపీఎం కార్యాలయం వద్ద ఆదివారం కామ్రేడ్ చొక్కా ఆశీర్వాదం వర్ధంతి కార్యక్రమాన్ని సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి డోకిపర్తి రాజేంద్రబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావులు ముఖ్య అతిథులుగా విచ్చేసి ఆశీర్వాదం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించగా, తాడేపల్లి మండల నాయకులు పల్లె కృష్ణ, డోకిపర్తి కోటయ్యలు సీపీఎం స్థూపానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి, శివశంకరరావులు మాట్లాడుతూ ఆశీర్వాదం పెద్దగా చదువుకోకపోయినా మార్క్సిజం, లెనినిజం పట్ల ఆకర్షితుడయ్యారని, పార్టీ పట్ల నిబద్ధతతో, నిజాయితీగా ఉండేవారని అన్నారు. పార్టీ అభివృద్ధికి, గ్రామ అభివృద్ధికి అహర్నిశలు శ్రమించిన సీపీఎం మాజీ సర్పంచ్ కామ్రేడ్ డోకిపర్తి చలపతిరావుతో కలసి చేసిన కృషిలో ఆశీర్వాదం పాత్ర మరువలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు డోకిపర్తి కోటయ్య, దాసరి సురేష్, సీపీఎం తాడేపల్లి పట్టణ నాయకులు వై.బర్నబాస్, డేవిడ్, దావీదు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక క్యాంపులను పరిశీలించిన ఏఈఆర్‌వో



మంగళగిరి: పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఏఈఆర్‌వో లక్ష్మీకుమారి పరిశీలించారు. ఆదివారం ప్రత్యేక క్యాంపులుగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఏఈఆర్‌వో సిబ్బందికి ఓట్ల జాబితా సవరణ, చేర్పులు మార్పులపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీటీసీ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జెండా పట్టుకుంటే కేసులు

రూరల్ సీఐ బెదిరిస్తున్నాడన్న పెదవడ్లపూడి కార్యకర్తలు



నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి

మంగళగిరి: వైఎస్సార్ సీపీ జెండా పట్టుకుంటే కేసులు పెడతామని, ఐదు సంవత్సరాలు స్టేషన్ చుట్టూ తిరుగుతూ కేసులు ఎదుర్కుంటారని వైఎస్సార్ సీపీ జెండా పట్టుకోవద్దని, పార్టీ కార్యక్రమాలలో పాల్గొనరాదంటూ మంగళగిరి రూరల్ సీఐ తమను బెదిరిస్తున్నారంటూ మండలంలోని పెదవడ్లపూడి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట గల వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్)ని కలిసి పెదవడ్లపూడి నాయకులు, కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. పెదవడ్లపూడి టీడీపీ నాయకుడు ఒత్తిడితో సీఐ తమను వేధిస్తున్నట్లు తెలిపారు. వేమారెడ్డి మాట్లాడుతూ కేసులకు పోలీసుల బెదిరింపులకు, టీడీపీ నాయకులకు భయపడాల్సిన పని లేదని తనతో పాటు పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. తప్పుడు కేసులకు భయపడాల్సిన పని లేదని , సోషల్ మీడియాలో వ్యక్తిగత విమర్శలు చేయవద్దని సూచించారు. ఏ ఒక్క కార్యకర్తను వదులుకునేందుకు పార్టీ సిద్ధంగా లేదన్నారు. పార్టీ బలోపేతం కొరకు అంతా కృషి చేయాలన్నారు.

పోలీస్‌స్టేషన్ సీసీ కెమెరాల డేటా చోరీపై కేసు

లక్ష్మీపురం: నగరంలోని అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాల డేటాను చోరీ చేసి ఓ విలేకరికి ఇవ్వడంతో సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఘటనలో స్టేషన్ ఎస్ఐ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం అర్ధరాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. గుంటూరు నగరంలోని పోలీస్ స్టేషన్లు, ఎస్పీ కార్యాలయంలో సీసీ కెమెరాలు, ఇంటర్‌నెట్ కనెక్షన్లు సర్వీస్ అరండల్‌పేటకు చెందిన శేషు అందిస్తుంటాడు. అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాల డేటాను చోరీ చేశాడు. ఆ డేటాలో ఇటీవల బోరుగడ్డ అనిల్ కేసులో రాజమండ్రి నుంచి మూడు రోజుల పోలీస్ కస్టడీకి స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఆ సమయంలో బోరుగడ్డ అనిల్ పోలీస్ స్టేషన్‌లో బల్లపై దుప్పట్లు వేసుకుని విశ్రాంతి తీసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్న సమయంలో స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ కె.శ్రీనివాసరావు అక్కడే ఉండటం, ఉన్న డేటా ఓ పత్రికలో విలేకరిగా పని చేసే వ్యక్తికి శేషు ఇచ్చాడు. దాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో రెండు రోజులుగా బోరుగడ్డ అనిల్‌కు రాచమర్యాదలు చేస్తున్న అరండల్‌పేట పోలీసులు అనే కథనాలు వచ్చాయి. దీంతో రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి శనివారం రాత్రి అరండల్‌పేట సీఐ శ్రీనివాసరావును వీఆర్‌కు పిలిచారు. ఇదిలా ఉంటే డేటా చోరీ చేసిన విషయంపై అరండల్‌పేట ఎస్ఐ రోజాలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీసీ కెమెరాల టెక్నీషియన్ శేషు, ఓ దినపత్రికలో విలేకరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు బియ్యం పంపిణీ

నగరంపాలెం: ఒంటరి జీవనం సాగించే వయోవృద్ధులు, దివ్యాంగులకు తమవంతుగా సహాయం అందించాలని శ్రీహనుమాన్ ఆదర్శ సేవా సమితి అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ అన్నారు. కొత్తపేటలోని సమితి కార్యాలయంలో ఆదివారం వయోవృద్ధులు, దివ్యాంగులకు బియ్యం, 11 రకాల నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారాలతో సమితి ఏర్పడిన దగ్గర్నుంచి ప్రతి నెల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉచిత బియ్యం కమిటీ చైర్మన్ పోలేపల్లి వెంకటసుబ్రహ్మణ్యం, ఎస్వీ రమణ, టి.మురళీసాయి, పలకలూరి శివరావు, పోలేపల్లి లహరి, లక్ష్మీకుమారి, అనురాధ, స్నేహిత, వల్లంపాటి రజనీశ్వరరావు పాల్గొన్నారు.

సందడిగా కార్తిక వనమహోత్సవాలు





వనమహోత్సవంలో చిన్నారుల నృత్యాలు, ఆటలు పాటలు

నగర పరిధిలోని పెదవడ్లపూడి డీబీఎన్ గార్డెన్ ఆదివారం కార్తిక వనమహోత్సవంతో కళకళలాడింది. పట్టణంలోని వివిధ ఇంటి పేర్ల వారు ఏర్పాటు చేసిన వనమహోత్సవంతో సందడి నెలకొంది. సంహపక్తి భోజనాలు, చిన్నారుల ఆటలు, పాటలతో తోటంతా సందడి నెలకొంది.

-మంగళగిరి



వనమహోత్సవానికి హాజరైన ప్రజలు

కార్మికులు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలి



తాడేపల్లిరూరల్ : ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులందరు ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు అన్నారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరానికి ఆయన విచ్చేసి మాట్లాడుతూ కార్మికులు అడుగుతున్నది భిక్ష కాదని, వారి కష్టార్జితమని అన్నారు. స్థానిక శాసనసభ్యులు నారా లోకేష్ ఈ విషయంలో జోక్యం చేసుకుని సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఆర్థిక వనరులు సమకూర్చుకుని పక్కా ఇళ్లు నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. సీపీఎం, సీఐటీయూ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల పోరాటానికి సంపూర్ణ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కూరపాటి స్టీఫెన్, కార్మికులు కె.ఆదినారాయణ, బి.అంకయ్య, ఆశీర్వాదం, నవనీతం తదితరులు పాల్గొన్నారు.

నాయనమ్మపై మనవడి దాడి

తాడికొండ: తనకు స్థలం రాసివ్వలేదంటూ నాయనమ్మపై మనవడు దాడి చేసిన ఘటన తుళ్ళూరు మండలం ఐనవోలు గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఐనవోలు గ్రామానికి చెందిన 70 సంవత్సరాల వృద్ధురాలు వలపర్ల కోటిరత్నం పేరిట ఉన్న మూడున్నర సెంట్ల స్థలం తనకు రాసివ్వమని మనవడు అమర్‌దీప్ గత కొంత కాలంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. అందుకు ఆమె ఒప్పుకోకపోవడంతో ఆగ్రహం చెందిన యువకుడు ఇస్త్రీ పెట్టెతో కాల్చి గాయం చేసి మెడలో ఉన్న రెండు సవర్ల పాతిక చైన్‌ను లాక్కెళ్లి తాకట్టు పెట్టుకున్నాడు. ఈ కేసులో వృద్ధురాలు కోటిరత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కొండలు ఆధ్వర్యంలో అమర్‌దీప్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

